క్లుప్తంగా

89 మందికి వైద్య పరీక్షలు



పెదబయలులో రోగులను తరలిస్తున్న బస్సుకు జెండా ఊపుతున్న వైద్య సిబ్బంది

పెదబయలు: పెదబయలు పీహెచ్‌సీ ఆవరణలో ఆంధ్ర వనవాసీ కళ్యాణ్ ఆశ్రమం ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 89 మందికి వైద్య పరీక్షలు చేశారు. వారిలో 39 మందికి శస్త్ర చికిత్స అవసరం కాగా.. ప్రత్యేక వాహనంలో విశాఖపట్నం తరలించారు. రోగులకు శస్త్ర చికిత్స చేసి తిరిగి ఇంటికి చేరేంత వరకు జాగ్రత్తలు తీసుకుంటామని వైద్యాధికారి డి.శ్రీనివాస్ తెలిపారు. ప్రతి నెలా 22న పెదబయలులో వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు నిఖిల్, సత్యశ్రీ జెండా ఊపి రోగులను తరలించారు. ఈ కార్యక్రమంలో అనిల్ నీరుకొండ వైద్య సిబ్బంది, పాంగి బంగారయ్య, భరత్, హర్ష, పాంగి కాసులమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు వైద్యుల బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపడుతున్న డాక్టర్ కిశోర్

జి.మాడుగుల: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులుగా డాక్టర్ బి.కిశోర్, డాక్టర్ ఇందిర మంగళవారం బాధ్యతలు చేపట్టారు. పెదబయలు మండలం రూడకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా పని చేసి డాక్టర్ కిశోర్ స్థానిక పీహెచ్‌సీకి బదిలీపై వచ్చారు. విజయవాడ పరిసర ప్రాంతాల నుంచి డాక్టర్ ఇందిర బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. శక్తివంచన లేకుండా మెరుగైన వైద్య సేవలు అందిస్తామని వారు తెలిపారు.

మొండిగెడ్డలో గ్రామసభ



మాట్లాడుతున్న అధికారులు

గూడెంకొత్తవీధి: మొండిగెడ్డలో మంగళవారం పీవీటీజీ గ్రామసభ నిర్వహించారు. దీనిలో పాల్గొన్న ఎంపీపీ బోయిన కుమారి మాట్లాడుతూ పీవీటీజీల కోసం చేపట్టిన పథకాలను ఆమె వివరించారు. పీఎం జన్మన్‌లో అమలు చేస్తున్న కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సభలో కార్యదర్శి పూర్ణచంద్రరావు, వార్డు మెంబర్‌లు శాంతి, హరి, లక్ష్మణ్ పాల్గొన్నారు

చింతపల్లిలో జనరల్ వైద్య నిపుణుడు నియామకం



జనరల్ వైద్యనిపుణులు సంతోష్ కుమార్

చింతపల్లి: చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో జనరల్ మెడిసిన్ వైద్య నిపుణుడిగా కర్రి సంతోష్‌కుమార్ నియమితులయ్యారు. ఇటీవల ప్రభుతం చేపట్టిన బదిలీల్లో భాగంగా వద్దాది, మాడుగుల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పని చేస్తున్న సంతోష్ కుమార్‌ను చింతపల్లి ఏరియా ఆస్పత్రికి బదిలీపై వచ్చారు. చింతపల్లి కమ్యూనిటీ ఆస్పత్రి నుంచి ఏరియా ఆస్పత్రిగా మార్పు చేసినప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగానే ఉంది. ప్రస్తుతం ఈ పోస్టును భర్తీ చేస్తూ వైద్య ఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన మంగళవారం ఆస్పత్రిలో బాధ్యతలు చేపట్టారు.

ఐదో తరగతి వరకు కొనసాగించాలని విజ్ఞప్తి



ఎంఈవోకు వినతిపత్రం అందిస్తున్న హెడ్ క్వార్టర్ సర్పంచ్ వెంకటరావు

డుంబ్రిగుడ: మండల కేంద్రం డుంబ్రిగుడలోని ఎంపీపీ పాఠశాలలో ఐదో తరగతి వరకు కొనసాగించాలని స్థానిక పోతంగి సర్పంచ్ వి.వెంకటరావు ఎంఈవోకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వం నుంచి ఇక్కడ ఎయిడెడ్ పాఠశాలగా అప్‌గ్రేడ్ అయి ఐదో తరగతి వరకు ఉండేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాకతో ఇక్కడ విద్యార్థులను తగ్గించి మూడో తరగతి వరకు కొనసాగించడం దారుణమన్నారు. మండల కేంద్రంలోని పాఠశాలలో మూడో తరగతి ఉండడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కృష్ణ. తదితరులు పాల్గొన్నారు.

గంజాయిపై యుద్ధం

- మత్తు పదార్థాల వినియోగంతో జీవితాలు చిత్తు
- వాడవాడలా మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవ అవగాహన ర్యాలీలు



పాడేరు పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ దీనబంధు, ఎస్‌ఐలు సురేష్, గోవిందరావు, పోలీస్ సిబ్బంది



జి.మాడుగులలో గంజాయి, డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌ఐ షణ్ముఖరావు, జీపు, ఆటో డ్రైవర్లు



ఎటపాకలో ర్యాలీ చేస్తున్న పోలీసులు, యువత

పాడేరు : గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలకు బానిసై యువత తమ జీవితాలను చిత్తు చేసుకోవద్దని పాడేరు సీఐ దీనబంధు సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఎస్పీ అమిత్‌బర్దర్ ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం పాడేరు పట్టణంలో ఆటో, జీపు యూనియన్‌ల నాయకులు, డ్రైవర్లతో కలిసి అగగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి స్టేట్ బ్యాంకు రహదారి మీదుగా మెయిన్ బజారు వరకు ఈ ర్యాలీ సాగింది. అనంతరం అవగాహన సదస్సు నిర్వహించారు. యువత గంజాయి రవాణ, అమ్మకాలు, సేవించడం వంటి కార్యకలపాలకు దూరంగా ఉండి స్వేచ్ఛా జీవితం గడపాలన్నారు. గంజాయి కేసుల్లో పట్టుబడితే కఠిన శిక్షలు అమల్లో ఉన్నాయన్నారు. ఏజెన్సీలో గంజాయి నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఎస్‌ఐలు ఎల్.సురేష్, గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలో సంతబయలు వారపు సంత, జి.మాడుగులలో ఎస్‌ఐ షణ్ముఖరావు ఆధ్వర్యంలో జీపు, ఆటో డ్రైవర్లు గంజాయి, డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 50 మంది ఆటో, జీపు డ్రైవర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎటపాక: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎటపాక సీఐ కన్నపరాజు సూచించారు. ఈ నెల 26న జరగనున్న ప్రపంచ డ్రగ్స్ వ్యతిరేక దినం సందర్భంగా మంగళవారం ఎటపాకలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మాదకద్యవ్యాల వినియోగం, వ్యాపారం చట్టవిరుద్ధమని, యువత వీటికి దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై యువత అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అప్పలరాజు, గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకట్రామిరెడ్డి, 50మంది ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: గంజాయి వంటి మాదక ద్రవ్యాలను వాడటం వల్ల కలిగే దుష్పరిణామాలపై పోలీసులు మంగళవారం రాజవొమ్మంగిలో ర్యాలీ నిర్వహించారు. బ్యానర్లు చేతపట్టి నినాదాలు చేశారు. సీఐ సన్యాసినాయుడు, ఎస్‌ఐ నరసింహమూర్తి, సిబ్బంది, ఆటో యూనియన్ సభ్యులు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

రంపచోడవరం/మోతుగూడెం: రంపచోడవరం అంబేడ్కర్ సెంటర్‌లో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం సీఐ రవికుమార్, ఎస్‌ఐ వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు. డొంకరాయి, మోతుగూడెం పీఎస్ పరిధిలో కూడా అవగాహన ర్యాలీ చేపట్టారు. గ్రామస్తులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఎస్‌ఐలు సాదిక్, శివకుమార్‌లు పాల్గొన్నారు. మారేడుమిల్లిలో రంపచోడవరం డీఎస్పీ సాయిప్రశాంత్, సీఐ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో మారేడుమిల్లి, గుర్తేడు ఎస్‌ఐలు శ్రీనివాస్, పార్థసారధి గంజాయి, డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. యువత గంజాయికి దూరంగా ఉండాలని సూచించారు.

గంగవరం : మండల కేంద్రం గంగవరంలో ఎస్‌ఐ బి.వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో అడ్డతీగల సీఐ నరసింహమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సీఐ మాట్లాడుతూ డ్రగ్స్‌కు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని, బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దని హితవు పలికారు. పీసా ఉపాధ్యక్షుడు పి.శివరామకృష్ణ, ఆటో యూనియన్ నాయకులు ఎం.రాంబాబు, శివ, సుబ్బారావు, యువసేన యువకులు వెంకటరమణ, గిరిబాబు, స్థానిక పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: స్థానిక పోలీసులు జాతీయ రహదారిపై గంజాయి వద్దు– వ్యవసాయమే ముద్దు అంటూ నినాదాలతో పరివర్తన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌ఐ కె.పాపినాయుడు ఆధ్వర్యంలో ఆటో యూనియన్ సభ్యులు, గ్రామ యువకులు ఈ కార్యక్రమం చేపట్టారు. చెడు మార్గాలను వీడి సన్మార్గంలో నడవాలని పోలీసులు సూచించారు.



డుంబ్రిగుడ జాతీయ రహదారిలో పరివర్తన కార్యక్రమం నిర్వహిస్తున్న పోలీసులు, యువత



రాజవొమ్మంగిలో పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీ



రంపచోడవరంలో..



మోతుగూడెంలో..



గంగవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ నరసింహమూర్తి, ఎస్‌ఐ వెంకటేష్, విద్యార్థులు, యువకులు

గంజాయి సాగు, రవాణా నేరం



పెదబయలు కూడలిలో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ కొల్లి రమణ

పెదబయలు: ప్రపంచ మాదక ద్రవ్యాల నిషేధ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెదబయలులో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలీసు స్టేషన్ నుంచి పెదబయలు కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం స్థానిక ఎస్‌ఐ కొల్లి రమణ మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా, సేవించడం, రవాణాకు సహకారం అందించడం, నిల్వ చేయడం నేరమన్నారు. ఖైనీ, గుట్కా, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయికి సంబంధించి నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(ఎన్‌డీఆర్‌ఎఫ్), ఇటీవల కొత్తగా ఏర్పాటు చేసిన ఈగల్ టీంపై, టోల్‌ఫ్రీ నంబర్ 1972పై అవగాహన కల్పించారు. అనంతరం పెదబయలు పాఠశాల, కళాశాల విద్యార్థులకు, ప్రజలు పనులు చేస్తున్న ప్రదేశాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు.

ప్రత్యామ్నాయ ఉపాధ్యాయుడిని నియమించాలి

వీఆర్‌పురం: కుందులూరు పంచాయతీ పరిధిలో మారుమూల కొండరెడ్డి గ్రామమైన టేకులురు గ్రామాన్ని ఎంపీపీ కారం లక్ష్మీ మంగళవారం సందర్శించారు. ఇక్కడి పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులు, గ్రామ పెద్దలు, విద్యా కమిటీ చైర్మన్‌తో మాట్లాడారు. పాఠశాల వివరాలు తెలుసుకున్నారు. ఈ పాఠశాలలో సుమారు 40 మంది విద్యార్థులు చదువుతుండగా.. ఒక్కరే ఉపాధ్యాయులు ఉన్నారని ఎంపీపీకి వారు వివరించారు. పని మీద టీచర్ బయటకు వెళ్తే ఆ రోజు పిల్లలు చదువుకు దూరం అవుతున్నారని, ప్రత్యామ్నాయ టీచర్‌ని నియమించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చినబాబు, మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్, పోడియం శ్రీరామమూర్తి, సత్తిబాబు, వడ్లది రమేష్, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం బాలరాజుకు ఘన సన్మానం



హెచ్‌ఎం బాలరాజును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గంగవరం : మోహనాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మామిడి బాలరాజు సేవలు ఆదర్శనీయమని యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు సిహెచ్.రాంబాబు కొనియాడారు. మోహనాపురం స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంగా ఐదేళ్ల పాటు పనిచేసి ముసురుమిల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్తున్న బాలరాజును మంగళవారం స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. మోహనాపురం ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు స్వీకరించిన ఆర్‌వీవీ సత్యనారాయణకు ఘన స్వాగతం పలికారు. అలాగే బదిలీపై వెళ్తున్న మరో ఉపాధ్యాయుడు రమేష్‌ను కూడా ఉపాధ్యాయులు సన్మానించారు. జీపీఎస్ పాఠశాలల హెచ్‌ఎంలు సూరన్నదొర, బొగ్గుల కాటంరెడ్డి, పరదా స్వామిదొర, పాపన్నదొర, పాఠశాల డిప్యూటీ వార్డెన్ కె.వీరపురెడ్డి, సీనియర్ ఉపాధ్యాయులు సోమయ్య, లక్ష్మణరావు, పీడీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రస్ట్ బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం



అంతర్లలో బాధితులతో మాట్లాడుతున్న జిల్లా గిరిజన సంఘం అధ్యక్షుడు చిన్నయ్యపడాల్

చింతపల్లి: ఆదివాసీ ట్రస్ట్ పేరిట నష్టపోయిన గిరిజన కుటుంబాలకు న్యాయం జరిగేంత వరకూ పోరాటం కొనసాగిస్తామని జిల్లా గిరిజన సంఘం అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ స్పష్టం చేశారు. మంగళవారం అంతర్లలోని ఆదివాసీ ట్రస్టు కార్యాలయం ఎదుట బాధిత సభ్యులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ వ్యాప్తంగా ఓ గిరిజనుడే అమాయక గిరిజనులను మోసం చేసి డబ్బులు ఎర చూపి కోట్లాది రూపాయలు దోచుకుని అన్యాయం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికే గిరిజనులకు జరిగిన అన్యాయాన్ని జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ మోసంపై అధికారుల సైతం తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే అనేక మంది అప్పులు పాలై ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితిలో ఉన్నారని, వెంటనే బాధితులకు న్యాయం చేసే విదంగా కలెక్టర్ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాంగి ధనుంజయ్, సాగిన చిరంజీవి, చింతపల్లి, జీకే వీధి మండలాల బాధితులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మహిళా సర్పంచ్‌లకు శిక్షణ

అరకులోయ టౌన్: అరకులోయ, అనంతగిరి మండలాల్లోని మహిళా సర్పంచ్‌లకు ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు ఎంపీడీవోలు అడప లవరాజు, ఎ.వి.వి.కుమార్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఏపీ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థ, పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ వార్షిక ప్రణాళిక 2025లో భాగంగా అరకులోయ మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఈ తరగతులు నిర్వహిస్తామన్నారు. భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. మహిళా సర్పంచ్‌లు అందరూ విధిగా హాజరు కావాలని, ఆధార్ లింక్ అయిన ఫోన్‌లను వెంట తీసుకురావాలని వారు కోరారు.

26 నుంచి వృద్ధుల ఇంటికి రేషన్ పంపిణీ

గూడెంకొత్తవీధి: ఈ నెల 26 నుంచి 65 సంవత్సరాలు దాటిన వృద్ధులకు ఇంటికి తీసుకెళ్లి రేషన్ సరకులు అందజేయాలని తహశీల్దారు రామకృష్ణ ఆదేశించారు. ఆయన కార్యాలయంలో మంగళవారం డీలర్లు, వీఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. రేషన్ పంపిణీ కోసం వీఆర్‌వోలు, సచివాలయ సంక్షేమ సహాయకులు, డీఏలను పర్యవేక్షకులుగా నియమించామన్నారు.

ధర్తి ఆబ జన్‌భగీదరి అభియాన్‌పై అవగాహన



నుర్మతి గ్రామంలో మాట్లాడుతున్న ఎంపీడీవో డేవిడ్‌రాజ్

జి.మాడుగుల: మండలంలో నుర్మతి పంచాయతీ కేంద్రంలో మంగళవారం 15వ ధర్తి ఆబ జన్‌భగీదరి అభియాన్, జన్‌జాతీయ గౌరవ్ వర్ష్ వేడుకల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ లంబోరి అప్పలరాజు, ఎంపీడీవో డేవిడ్‌రాజ్, సీడీపీవో కె.బి.సి.హెచ్‌ఎం.దేవి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సూరిబాబు, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న మాదిరెడ్డి కృష్ణబాబు

ఎటపాక: ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మంత్రిప్రగడ నరసింహారావు, జిల్లా కమిటీ సభ్యుడు మాదిరెడ్డి కృష్ణబాబు డిమాండ్ చేశారు. మంగళవారం వెంకటరెడ్డిపేట గ్రామంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. సూపర్‌సిక్స్ వాగ్దానాలు అమలు చేయటంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని విమర్శించారు. తల్లికి వందనం అములులో ప్రతిబంధకాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇవ్వాలని, కొత్త పింఛన్లు, రైతులకు, యువతకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేసారు. తుపాన్లు, గోదావరి వరదలకు నాలుగు మండలాల్లో ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి తానికొండ వాసు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పసుపులేటి లక్ష్మణరావు, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గోసు ప్రశాంత్, రంబాల నాగేశ్వరరావు, గొల్లపల్లి శివబాబు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దారు రామకృష్ణ

చింతపల్లి: మండలంలో లబ్ధిదారులైన వృద్ధులకు నిత్యావసర సరకులు సకాలంలో అందించేలా చర్యలు చేపట్టాలని తహసీల్దారు రామకృష్ణ ఆదేశించారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో జీసీసీ సేల్స్‌మేన్లు, డీలర్స్, వీఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 65 సంవత్సరాలు పైబడిన వారికి నేరుగా నిత్యావసర సరకులను ఇంటి వద్దకే అందించాలని సూచించారు. లబిదారులకు జూలై నెలకు ముందుగానే ఈ నెల 26 నుంచి ఈ పంపిణీ కార్యక్రమం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమం సక్రమంగా నిర్వహించేందుకు వీఆర్‌వోలు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, డిజిటల్ అసిస్టెంట్‌లు బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ చంద్రశేఖర్, ప్రత్యేక సర్వే డీటీ బాలుదొర, తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి



పెదబరడ గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

చింతపల్లి: పంచాయతీలలో నిర్వహించే గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసరావు కోరారు. మంగళవారం మండలంలో పెదబరడ పంచాయతీ పరిధిలోని చింతలూరు, లోతుగెడ్డ పంచాయతీ బందబయలు, తమ్మెంగుల పంచాయతీ కేంద్రాలలో గ్రామసభలు నిర్వహించారు. పెదబరడ గ్రామసభలో ఎంపీడీవో మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి గ్రామసభలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచులు సమిడి గోపాల్, సునిల్, సలిమితి లక్ష్మయ్య పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

29న మోహనాపురంలో ఉచిత వైద్య శిబిరం

అడ్డతీగల: గంగవరం మండలం మోహనాపురంలో ఈనెల 29 న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆంధ్ర వనవాసీ కళ్యాణ్ ఆశ్రమ్ జిల్లా అధ్యక్షుడు బొగ్గుల కాటంరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాయత్రి వైద్య కళాశాల వైద్యుల సహకారంతో ఈ శిబిరం నిర్వహిస్తామన్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైన రోగులను ఉచితంగా వైద్య కళాశాల బస్సులపై తీసుకువెళతారన్నారు. పేర్లు నమోదు చేసుకున్న వారికి కుటుంబ నియంత్రణ, కంటి శస్త్ర చికిత్సలు, ఇతర వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. గిరిజన ప్రాంత ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వరదలను సమర్థంగా ఎదుర్కొంటాం..



వరద సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

కూనవరం: గోదావరి వరదలను సమర్థవంతంగా ఎదుర్కొంటామని తహసీల్దార్ కె.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ఆయా గ్రామాల పెద్దలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ వరదలకు ముందు, వరదల సమయంలో, వరదల అనంతరం ప్రజలకు అందించాల్సిన సేవలకు సంబంధించి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. పునరావాస కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని, రెండు, మూడు రోజుల్లో బఫర్ స్టాక్ వస్తుందని చెప్పారు. ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థలు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని, వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. గోదావరి వరదల సమయంలో పునరావాస కేంద్రాలలో సోలార్ విద్యుత్, మొబైల్ టాయిలెట్స్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ప్రజా ప్రతినిధులతో సహా వివిధ పార్టీల నాయకులు, ప్రజలు కోరారు. గోదావరి నీటి మట్టం ఎన్ని అడుగులు పెరిగితే ఏయే గ్రామాలు ముంపునకు గురవుతున్నాయో క్షేత్రస్థాయి సర్వే నిర్వహించాలని పలువురు సూచించారు. వరద సమయంలో ఎమర్జెన్సీ సేవలు అందించేందుకు కోతులగుట్ట నుంచి బోదునూరు, పాలగూడెం మీదుగా ఏడుగురాళ్ళపల్లి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీపీ పాయం రంగమ్మ, ఎంపీడీవో రామాంజనేయ ప్రసాద్, ఎస్‌ఐ లతశ్రీ, సర్పంచ్‌లు మల్లంపల్లి హేమంత్, సున్నం అభిరామ్, కట్టం లక్ష్మి, నిరోషా, వైస్ ఎంపీపీ సాంబశివరావు, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వీఆర్‌పురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం మీటింగ్ హాల్‌లో వరద సమీక్ష సమావేశం మంగళవారం తహసీల్దార్ సరస్వతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ వరదల సమయంలో అధికారులు అందుబాటులో ఉండాలని కోరారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. వరదల సమయంలో రాకపోకలు జరగాలంటే కుందులూరు నుంచి తులసిపాక వరకు రోడ్డు సదుపాయం కల్పించాలని కోరారు. మర పడవలు, లాంచీలు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కారం లక్ష్మి, జెడ్పీటీసీ వాళ్ళ రంగారెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్, ఎస్‌ఐ సంతోష్‌కుమార్, డీటీ రాంబాబు, ఆర్‌ఐ మడకం రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయిరామ్, ఈవోఆర్‌డీ శ్రీకాంత్ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



వీఆర్‌పురంలో వరద సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కారం లక్ష్మి